క్లుప్తంగా

డీజే సౌండ్ సిస్టమ్ నిషేధం

చిలుకూరు : డీజే సౌండ్ సిస్టమ్‌ను నిషేధిస్తూ జిల్లా మేజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు చిలుకూరు ఎస్‌ఐ రాంబాబుగౌడ్ తెలిపారు. శనివారం ఆయన చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. వివాహ, పుట్టిన రోజు వేడుకలు, ఇతర ఫంక్షన్లు, మీటింగ్‌లు, ర్యాలీలకు డీజేలను పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించి డీజేలు పెడితే డీజేల వాహనాలను, యజమాని, వేడుకల నిర్వాహకులపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైన డీజేలు ఉపయోగిస్తే 87126 86044 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు.

కల్యాణ మండపం నిర్మాణానికి సిమెంట్ బస్తాలు అందజేత

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కల్యాణ మండపం నిర్మాణానికి కోదాడకు చెందిన శాంతి బుక్స్ స్టాల్ నిర్వాహకుడు గెల్లి చక్రధరరావు శనివారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.20 వేలు విలువ చేసే 50 సిమెంట్ బస్తాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు భౌరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకటనారాయణ గుప్త, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

మోతె : మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రంతో పాటు రాఘవాపురం ఎక్స్ రోడ్డు గ్రామంలో గల నాగార్జున జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ దుకాణాన్ని శనివారం కోదాడ ఏడీఏ యల్లయ్య తనిఖీ చేశారు. దుకాణాల్లో రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఎరువులు, పురుగు మందులను నిర్ణీత ధరలకే విక్రయించాలన్నారు. రైతులు, తదితరులు పాల్గొన్నారు.

చార్జింగ్ ట్రై సైకిల్ అందజేత



ట్రై సైకిల్ అందజేస్తున్న మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపల సింగారం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వికలాంగుడు చింతమళ్ల నగేష్‌కు తాజా మాజీ సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి రూ.50 వేల విలువ గల చార్జింగ్ ట్రై సైకిల్‌ను శనివారం అందజేశారు. ఆమె వెంట సారెడ్డి భాస్కర్‌రెడ్డి, నందిరెడ్డి సైదిరెడ్డి, కామళ్ల క్రాంతి, జంగం రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో పాస్టర్స్ నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు శామ్యూల్

హుజూర్‌నగర్ : పట్టణంలోని సాల్వేషన్ చర్చిలో శనివారం పాస్టర్ల మండల నూతన కమిటీని పాస్టర్స్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు శామ్యూల్ గుండు అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఆదాము, ఉపాధ్యక్షుడు ఇస్సాక్, సెక్రటరీగా రూబేను, జాయింట్ సెక్రటరీగా జేమ్స్, ఎగ్జిక్యూటీవ్ కమిటీ సభ్యులుగా జేమ్స్, రంజిత్, గౌరవ సలహాదారుడిగా రాజారావు, కోఆర్డినేటర్‌గా ఫినేహాస్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు యహోషాపాతు, దానుబాబు, యోహాను, జాన్‌పాల్, జీవన్‌కుమార్, జాన్ వెస్లి, అభిషేక్, కృపాకర్, నతనియేల్, సైదా, రాంబాబు, ఇస్రోను తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేపట్టాలి



ప్రకృతి వ్యవసాయం పద్ధతులను రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్త ఎ.కిరణ్

గరిడేపల్లి : రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న వృత్తి నైపుణ్య శిక్షణలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంతో నేల సారవంతం అవుతుందని తెలిపారు. వాతావరణంలోని మిత్ర పురుగులు పరిరక్షించుకోవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా పశువుల ఎరువుల ప్రాముఖ్యత, వర్మీ కంపోస్టు తయారీ, వర్మీవాష్ తయారీ, అజోల్లా పెంచే విధానాలు, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, మార్కెటింగ్ పద్ధతులపై వివరించారు. కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డి.ఆదర్శ్ మాట్లాడుతూ.. తొలి దశలో పంటకు ఆశించే రసం పీల్చే పురుగుల నివారణకు జిగురు అట్టలను అమర్చుకోవడం, వేప నూనె పిచికారీ చేయాలన్నారు. రైతులు పాల్గొన్నారు.

సరుకులు అందజేత

గరిడేపల్లి : మండలంలోని సర్వారం గ్రామంలో కేన్సర్‌తో బాధపడుతున్న పెండెం జయమ్మకు శనివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో నెలకు సరిపడ నిత్యావసర సరుకులను క్లబ్ అధ్యక్షుడు జిలకర రామస్వామి అందజేశారు. క్లబ్ ఉపాధ్యక్షుడు కీత కనకయ్య, సభ్యులు చిత్రం విశ్వనాథ్, గ్రామస్తులు కీసర వెంకన్న, సుజాత పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ



నేరేడుచర్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మలతో డాక్టర్లు, వైద్య సిబ్బంది



చిలుకూరు : మిట్స్ కళాశాలలో బతుకమ్మలతో విద్యార్థినులు

హుజూర్‌నగర్ : తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ డీఐఈఓ భాను నాయక్ అన్నారు. శనివారం హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్, అధ్యాపకులు బ్రహ్మచారి శ్రీనివాస్‌రెడ్డి, నరసింహారాజు, నరసింహారావు, రవిబాబు, రమణారెడ్డి, నాగుల్ మీరా, ఉపేంద్ర, శోభారాణి, అరుణ్, జ్యోతి, రామ్మూర్తి, తిరుమలరావు, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ కళాశాలలో..

చిలుకూరు : మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఎంబీఏ, బీఫార్మసీ విద్యార్థులు శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలతో బతుకమ్మలు పేర్చి ఒకచోట చేర్చి ఆడిపాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమామహేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

నేరేడుచర్ల : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బతుకమ్మ సంబరాలను వైద్య సిబ్బంది ఘనంగా నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి ఒకచోట చేర్చి ఆడిపాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారిని నాగిని, హోమియో డాక్టర్ ఆర్.శృతి, సీహెచ్‌ఓ శ్రీనివాస్, సూపర్‌వైజర్ ధనమ్మ, వెంకటేశ్వర్లు ఫార్మసిస్టులు, స్టాఫ్ నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకల్లో డీఐఈఓ భానునాయక్

ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తాం

హుజూర్‌నగర్ : ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్నగౌడ్ అన్నారు. వివిధ రంగాల్లో సేవ చేస్తున్న వారికి ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ తెలంగాణ సంస్థ అందించే విశిష్ట డాక్టరేట్ పురస్కారానికి యరగాని నాగన్నగౌడ్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా శనివారం హుజూర్‌నగర్‌లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకుడు ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ గురవయ్య, చింతకాయల రాము, పాశం రామరాజు, ఆశా కార్యకర్తల సంఘం నాయకురాళ్లు జానకి, నిర్మల, సవిత, సంధ్య పాల్గొన్నారు.



నాగన్న గౌడ్‌ను సన్మానిస్తున్న ఆశా కార్యకర్తలు, తదితరులు

న్యాయవాదుల సమస్యలపై పోరాడాలి

కోదాడ రూరల్ : న్యాయవాదుల సమస్యలపై ఐలు(ఆలిండియా లాయర్స్ యూనియన్) సభ్యులు పోరాడాలని ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, బార్ కౌన్సిల్ మెంబర్ కొల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం కోదాడలోని బార్ అసోసియేషన్ హాల్ నిర్వహించిన ఐలు జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికంగా ఉన్న కోర్టుల్లో సమస్యలపై అధ్యయనం చేయాలని, సంఘం సభ్యత్వాల నమోదును పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా అధ్యక్షుడిగా వేజెల్ల రంగారావు(కోదాడ), ప్రధాన కార్యదర్శిగా మారపాక వెంకటేశ్వర్లు(సూర్యాపేట)ను తాత్కాలికంగా ఎంపికచేశారు. ఈ సమావేశంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి మామిడి వెంకట్‌రెడ్డి, జిల్లా నాయకులు ఉయ్యాల నర్సయ్య, వెంకట్‌రెడ్డి, యాదగిరి, అంజయ్య, విద్యాసాగర్, హేమలత, మోషా, పాషా, శరత్‌కుమార్, మురళి తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొల్లి సత్యనారాయణ

నాసిరకం మందులు వాడొద్దు

పాలకవీడు: వరిలో చీడపీడల నివారణకు రైతులు నాసిరకం మందులు వాడొద్దని డీఏఓ శ్రీధర్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన పాలకవీడుతోపాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రైతుల పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువుల కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలన్నారు. వరిలో చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉన్న సమయంలో తాత్కాలికంగా నత్రజని (యూరియా) వినియోగాన్ని నిలిపివేయాలన్నారు. ఆయన వెంట ఏఈఓలు వెంకటేష్, శ్రీకాంత్, గోపి, రైతులు పాల్గొన్నారు.



వరిపొలాన్ని పరిశీలిస్తున్న డీఏఓ శ్రీధర్‌రెడ్డి

ఎక్సైజ్ పోలీసుల దాడులు

- 26 లీటర్ల సారా స్వాధీనం
- 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో పోలీసుల, ఎక్సైజ్ అధికారులు శనివారం సంయుక్తంగా దాడులు నిర్వహించి 26 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 800 లీటర్ల బెల్లం పానకం ధ్వసం చేశారు. ఎక్సైజ్ సీఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు చింతలపాలెం మండలం ఎర్రకుంటతండాకు చెందిన బుక్యా వీరా ఇంటిపై స్థానిక పోలీసులు, ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 150 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి కేసు నమోదు చేశారు. అదేవిధంగా మేళ్లచెరువు మండలంలోని పలు తండాల్లో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు 250 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గరిడేపల్లి మండలం రేగులగడ్డతండాకు చెందిన బానోతు కాంతమ్మ, తేజవత్ వెంకటమ్మ ఇళ్ల నుంచి 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఇరువురిపై కేసు నమోదు చేశారు. నేరేడుచర్ల మండలం బూర్గులతండాకు చెందిన మాలోతు లక్ష్మి ఇంటి నుంచి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. పాలకీడు మండలం కొత్తతండాకు చెందిన గుగులోతు బుజ్జి ఇంటి నుండి 5.5 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు దివ్య, వెన్నెల, జగన్మోహన్‌రెడ్డి, సివిల్ ఎస్ఐలు అంతిరెడ్డి, రవీందర్, నరేష్, లక్ష్మీనరసింహ, సిబ్బంది నాగయ్య, జయరాజ్ ధనుంజయ్, రవి, నాగమణి, బాలు, స్వాతి, నవీన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం దుర్గామాత.. అన్నపూర్ణదేవీ అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. – సాక్షినెట్‌వర్క్



హుజూర్‌నగర్ : పూజలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు



నేరేడుచర్ల : విజయదుర్గ ఆలయంలో శాంతి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కోదాడ : నయానగర్‌లో అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



గరిడేపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



కోదాడరూరల్ : సర్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

మున్నూరుకాపు సత్రం అభివృద్ధికి సహకరించాలి



దాతలకు రశీదు ఇస్తున్న ఆకుల రాము

మఠంపల్లి : మండలంలోని మట్టపల్లిలో గల శ్రీకృష్ణ దేవరాయ మున్నూరు కాపు అన్నదాన సత్రం అభివృద్ధికి తెలుగు రాష్ట్రాల కుల బంధువులు సహకరించాలని అన్నదాన సత్రం కన్వీనర్ తోట వెంకయ్య నాయుడు, గౌరవ సలహాదారుడు ఆకుల రాము కోరారు. శనివారం స్థానికంగా సత్ర కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్రం భోజనశాలలో గ్రిల్స్ ఏర్పాటుకు మేళ్లచెరువుకు చెందిన డక్కా శ్రీహరి, కోటేశ్వరమ్మ దంపతులు రూ.60 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు బ్రహ్మారావు అన్నపూర్ణ, సిరిశ్రీ కార్తీక జైశ్రీరామ్, శ్రీనివాసరావు, వెంకయ్య, తిరుపతిరావు, నారాయణ, రామయ్య, అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి వెండిపాదాల బహూకరణ



వెండిపాదాలు అందజేస్తున్న దాతలు

కోదాడరూరల్ : పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి ఏపీలోని తెనాలికి చెందిన ధర్మవరపు చంద్రశేఖర్ జ్ఞాపకార్థం ఆయన భార్య పార్వతి, కుమారుడు నాగశివరామకృష్ణాలు శనివారం రూ.20వేల విలువైన వెండి పాదాలను బహూకరించారు. ఆలయంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మనుమరాలు ఈశ్వరమ్మకు ఈ వెండి పాదాలు ధరింపజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూకూరి అంజయ్య, అర్చకులు వెంకటకృష్ణ, అలుగూరి హరినాథ్‌బాబు, ఉషారాణి తదితరులు ఉన్నారు.

మార్చురీకి అనాథ మృతదేహం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్‌లో ఓ హోటల్‌లో పనిచేసే అనాథ వ్యక్తి శనివారం మృతి చెందగా మృతదేహాన్ని పోలీసులు కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాపురం క్రాస్ రోడ్‌కి 40 ఏళ్ల కిందట ఓ మూగ వ్యక్తి వచ్చి అక్కడ ఉన్న హోటల్స్‌లో పనిచేస్తూ వారి పెట్టింది తింటూ జీవించేవాడు. ఇటీవల అనారోగ్యం పాలైన అతను అక్కడే భిక్షాటన చేస్తూ శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు తమను సంప్రదించాలని రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

గరిడేపల్లి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను వెతికి పట్టుకున్న పోలీసులు శనివారం బాధితుడికి అందజేశారు. మండలంలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన బచ్చు నారాయణ రెండు నెలల క్రితం సెల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో అతను గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు నూతన సాంకేతిక పరిజ్ఞానం (సీఈఐఆర్) యాప్‌ను ఉపయోగించి సెల్‌ఫోన్ కనిపెట్టి బాధితునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

కీతవారిగూడెంను మండలంగా ప్రకటించాలి

గరిడేపల్లి : కీతవారిగూడెం గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని ప్రజా కళాకారుడు బాదె నర్సయ్య కోరారు. శనివారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో ఆట పాట నిర్వహించి మాట్లాడారు. 16 గ్రామ పంచాయతీలకు కేంద్రంగా ఉన్న కీతవారిగూడెంను మండలం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మండలం ఏర్పాటు చేయకపోతే రిలే నిరాహార దీక్ష చేపడతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల బృందం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు

- డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష

మేళ్లచెరువు : ఉపాధి హామీ సిబ్బంది అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష హెచ్చరించారు. మండలంలోని 13 గ్రామపంచాయతీల్లో ఏడాది కాలంగా నిర్వహించిన ఉపాధి హామీ పనులపై శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో స్వల్ప లోపాలు గుర్తించినట్లు తెలిపారు. ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలను గాను సిబ్బందికి రూ. 30 వేలు అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. ఉపాధి పనులు చేయకున్నా చేసినట్లు నమోదు చేసుకున్న గ్రూపుల నుంచి 40 వేల రూపాయలు రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. 2024–25 సంవత్సరానికి గాను నర్సరీల నిర్వహణకు ముందస్తుగా ప్రణాళికలు వేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంబుడ్స్‌మెన్ లచ్చిరాం నాయక్, విజిలెన్స్ అధికారి లింగారెడ్డి, ఉషారాణి, ఎంపీడీ అస్గర్‌అలీ, ఎస్సార్పీ సాంబశివచారి, ఎంపీఓ గోపి, ఏపీఓ శైలజ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ టీఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ శిరీష

మంత్రి ఉత్తమ్‌కు పరామర్శ

కోదాడరూరల్ : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి, స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మామ పురుషోత్తమ్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కోదాడ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు హైదరాబాద్‌లో మంత్రిని పరామర్శించారు. పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు. ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు భాషబోయిన భాస్కర్‌రావు, రిటైర్డ్ ఏసీపీ బుడిగ అంజయ్య, ముసి శ్రీనివాసరావు, ముసి మట్టయ్య, చింతకాయల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పురుషోత్తమ్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గడ్డం వెంకటస్వామికి ఘన నివాళి



హుజూర్‌నగర్ : వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



నేరేడుచర్ల : మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్మన్, తదితరులు

హుజూర్‌నగర్ : కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం వెంకట స్వామి (కాకా) జయంతిని శనివారం హుజూర్‌నగర్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కోతి సంపత్‌రెడ్డి, కమిషనర్ యాకూబ్ పాషా, సీనియర్ అసిస్టెంట్లు, వార్డు అధికారులు, మెప్మా, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేరేడుచర్ల : దివంగత కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరిత, కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు ఉన్నారు.



చిలుకూరు : వెంకటస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

చిలుకూరు : మాజీ ఎంపీ, కేంద్ర మాజీ మంత్రి వెంకటస్వామి జయంతిని శనివారం మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ధృవకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు

శతాధిక వృద్ధురాలు అచ్చమ్మ మృతి



అచ్చమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వరప్రసాద్‌రెడ్డి, తదితరులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయికి చెందిన శతాధిక వృద్ధురాలు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోతురాజు నర్సయ్య తల్లి అచ్చమ్మ (101) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఇర్ల సీతారాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు, లిక్కి వెంకటయ్య, పులి సులోచనరావు, వెంకటేష్, వేలాద్రి, కన్నెబోయిన వెంకన్న, సింగరయ్య, బాబు, ఏడుకొండలు ఉన్నారు.


ఇసుక లారీ సీజ్

మఠంపల్లి : అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీని మఠంపల్లి పోలీసులు శనివారం పట్టుకుని సీజ్ చేశారు. ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం నుంచి మఠంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ టీఎస్ 29 టీబీ 6677 లారీని పట్టుకుని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఏఎస్ఐ ఆనంద్ పాల్గొన్నారు.

ఐదు బృందాలతో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలోని 4వ వార్డులో ఫ్యామిలీ డిజిటల్ కార్డు పైలెట్ సర్వే కొనసాగుతోంది. ఐదు బృందాలతో సర్వే నిర్వహిస్తున్నారు. శనివారం వరకు 500 గృహాల సర్వే పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కత్తుల నాగేందర్, మున్సిపల్ కమిషనర్ యాకూబ్ పాషా, పురపాలక, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం



పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి : స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి పీఠం వద్ద శనివారం స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనరసింహస్వామి దీక్ష స్వాములు, భవాని దీక్ష స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

నడిగూడెం : కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి భాను నాయక్ కోరారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పలువురు విద్యార్థులు ప్రదర్శించిన ఆట, పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయనాయక్, అధ్యాపకులు జానిపాషా, కర్నాటి శ్రీధర్, సీహెచ్.కృష్ణ, బుస్సా మహేష్, నందిగామ ఈశ్వర్, కె.శ్రీనివాస్, వీరన్న, మదార్, నగేష్, నాగరాజు, సుజాత, రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

మోతె : అధికార, ప్రతిపక్ష పార్టీలు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మట్టిపెల్లి సైదులు హితవు పలికారు. శనివారం మోతె మండలంలోని సిరికొండ గ్రామంలో జరిగిన సీపీఎం గ్రామ శాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం బీక్యాతండాకు చెందిన బానోతు వెంకటేశ్‌ను సీపీఎం పార్టీలోకి ఆహ్వానించారు. తదనంతరం పార్టీ గ్రామ శాఖ కార్యదర్శిగా కాంపాటి శ్రీనును ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు మీసాల వెంకన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండల నాయకులు గుంటగాని ఏసు, అచ్చిరాం, పోతయ్య, అశోక్, రమేష్, వెంకటేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

చిలుకూరు : ప్రభుత్వాలు అవలంబించే ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఉద్యమాలు చేస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జె.నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని కొండాపురంలో జరిగిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 10వ తేదీన మాధవగూడెంలో జరగబోయే సీపీఎం 8వ మండల మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సీపీఎం సీనియర్ నాయకుడు వేనేపల్లి వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి నాగేటి రాములు, మాజీ ఎంపీటీసీ బత్తిని వెంకటయ్య, నాయకులు బుడిగెం రామారావు, నారసాని వెంకటేశ్వర్లు, గట్టు లింగయ్య, కిరణ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని గోపాలపురంలో శనివారం సీపీఎం గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ శాఖ కార్యదర్శిగా సిద్దల వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి హుస్సేన్, నాయకులు తిరుపతయ్య, భిక్షం, మాధవరావు, వెంకటేశ్వరరావు, సాయి, వాణి పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.